ప్రజాశక్తి
ఆదివారం 4 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం

6న సూపర్ 60 కోర్సులో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం ఐఐటిలో సూపర్ 60 కోర్సుప్రవేశ పరీక్ష ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు డిడి అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటి, ఎన్ఐటి, ఎంసెట్‌లో ఉచిత శిక్షణ కోసం నిర్వహించనున్న ఈ పరీక్షకు స్థానిక ఐటిడిఎ పరిధిలోగల గిరిజన గురుకుల కళాశాలలు, ఇతర కాలేజీలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గిరిజన విద్యార్థులు హాజరు కావాలన్నారు. పరీక్షా కేంద్రాలు మల్లి సిఇఒ కాలేజీ, సీతంపేట ఆర్‌జెసి బాలుర కాలేజీ, సీతంపేట ఆర్‌జెసి బాలికల కాలేజీ, పెద్దమడి ఆర్‌జెసి బాలుర కాలేజీ విద్యార్థులు, ఇతర కాలేజీ గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఎవరైనా ఈ పరీక్షా కేంద్రాల్లో హాజరు కావచ్చని డిడి, సూపర్ 60 కోర్స్ డైరెక్టర్ మురళీబాబు కోరారు. ఇతర సందేహాల నివృత్తికి 8247608256 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కేరళ వరద బాధితులకు అండగా నిలుద్దాం

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ● పలుచోట్ల సహాయ నిధి సేకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 300 మందికి పైగా మృత్యువాతపడ్డారని, వందలాది మంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కొంతమంది జాడ కానరావడం లేదని బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. కేరళ వరద బాధితులకు అండగా నిలించేందుకు శనివారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్, మెయిన్ రోడ్డు షాపుల వద్దకు పార్టీ కార్యకర్తలు నిధుల సమీకరణ చేపట్టారు. ప్రజల నుంచి రూ.8,800 వరకు వసూలైంది. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన కేరళ ప్రజలకు ప్రజలంతా అండగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి పూర్తిస్థాయి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా విరివిగా ఆర్థిక సహకారం అందజేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజలంతా బాధితులకు ఉదారంగా విరాళాలిచ్చి సంఘీభావాన్ని ప్రకటించాలని కోరారు. రిలీఫ్ ఫండ్‌కు డబ్బు పంపేందుకు అవసరమైన బ్యాంక్ ఖాతా వివరాలు అకౌంట్ పేరు : సిపిఐ(ఎం) పీపుల్స్ రిలీఫ్ ఫండ్, అకౌంట్ నెంబరు : 62109192143, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా,ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఎస్‌బిఐఎన్ 0020343, బీసెంట్ రోడ్ బ్రాంచ్, విజయవాడ. అలాగే మీ బ్యాంకు ఫోన్ పే రసీదు 9490764590కు వాట్సప్ ద్వారా పంపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ, జిల్లా కమిటీ నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, వి.ఇందిర, జి.తులసి, గౌరమ్మ, వరాలమ్మ, పి.రాజశేఖర్, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

సాలూరు: కేరళలోని వాయనాడ్ తుఫాన్ బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు, సీదరపు అప్పారావు ఆధ్వర్యాన పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల నుంచి విరాళాలు సేకరించారు. ప్రకృతి విలయతాండవానికి గురైన వాయనాడ్ ప్రజలకు అన్ని వర్గాల ప్రజలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.శంకరరావు, మండల నాయకులు వంతల సుందరరావు, కె.చినబాబు పాల్గొన్నారు.

బలిజిపేట : వయనాడ్‌లో వరద బాధిత కుటుంబాలకు సంఘీభావంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. దాతలు నుంచి రూ.7,350 విరాళాలు సేకరణ జరిగిందనీ సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ, నల్ల ఈశ్వరరావు, రైతు కూలి సంఘం నాయకులు మావిడి సింహాద్రి నాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా యూత్ ఫెడరేషన్ విరాళాల సేకరణ

గుమ్మలక్ష్మీపురం : కేరళ వరద బాధితుల సహాయం నిమిత్తం ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుమ్మ లక్ష్మీపురంలో శనివారం విరాళాలు సేకరించారు. ఇటీవల కేరళలో వచ్చిన వరదల కారణంగా వేలాదిమంది నిలువ నీడ లేక దిక్కుతో తోచని స్థితిలో ఉన్నారని, వీరికి అండగా నిలిచేందుకు ఆలిండియా యూత్ ఫెడరేషన్ విరాళాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కార్యదర్శి కోరంగి గోపీనాథ్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేటలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.



సాలూరులో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

రక్త పరీక్షలు నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గ్రామాల్లో విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా రక్త పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని డోకిశిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వరాల కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడారు. అక్కడ ఉన్న తానవలస గ్రామ చిన్నారులకు దగ్గరుండి ఆర్‌డిటి రక్త పరీక్షలు నిర్వహించి ఫలితాలను పరిశీలించారు. మలేరియా జ్వరం అని తేలడంతో వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అదే గ్రామంలో మలేరియా, డెంగీ వంటి జ్వరాలు తీవ్రం కాకుండా అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆత్యవసరమున్న చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. లేబర్, జనరల్ వార్డు, ఆపరేషన్ గదులను పరిశీలించారు. ఆసుపత్రిలోని రన్నింగ్ వాటర్ సౌకర్యం పరిశీలించారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోనే ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చని కలెక్టర్ అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన జిల్లేడువలసలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతను పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. మురుగు కాలువల వద్ద నీరు నిల్వను పరిశీలించి క్లోరినేషన్ పిచికారీ పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి తిరుపతిని ఆదేశించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి బొండాలు, టైర్లు వంటి వాటితో దోమలు వృద్ధి చెంది డెంగీ వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఆరుబయట మల విసర్జన విడనాడి వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరును ఆరా తీశారు. కొంత మంది చిన్నారులు హాజరు కాకపోవడానికి గల కారణాలను ప్రశ్నించారు. పొలం పనులకు తల్లిదండ్రుల వెంట వెళ్లారన్న విషయాన్ని అంగన్వాడీ కార్యకర్త కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిస్తూ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని సర్పంచ్, గ్రామస్తులను కలెక్టర్ కోరారు. గ్రామంలోని తాగునీటి పథకం, నూతన అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరగా, ప్రతిపాదన నివేదికలు అందిన వెంటనే మంజూరు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడంగి దిబ్బన్న, ఎంపిడిఒ షేక్ అబ్దుల్ జావేద్, సహాయ మలేరియా అధికారి డి .సూర్యనారాయణ, పిఒఆర్ బికె రఘు, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ కౌశిక్, వీఆర్వో మనోజ్ చౌదరి, ఎఎన్ఎం విజయ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో మూడోవిడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి ఆర్ ఐటిఐలో మూడో విడత కౌన్సెలింగ్ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఎలక్ట్రానిక్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్ మేకింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఈనెల 26 వరకు iti.ap.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. 27 లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని, 29న నిర్వహించబోయే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆశా వర్కర్లకు కనీస వేతనంతో పాటు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశా కార్యకర్తగా మార్పు చేయాలని కోరుతూ శనివారం స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్రకు ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ నాయకులు ఎం.శివాని, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బి.సూరిబాబు మాట్లాడుతూ ఆశా నియమాకాలు ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. ఆశాలను కార్మికులుగా గుర్తించాలన్నారు. 62 ఏళ్ల రిటైర్మెంట్ జీవో వర్తింపు చేయాలని, విధి నిర్వహణలో ప్రమాదవ, సెలవులు, అనారోగ్యంతో అనేక మంది ఆశాలు చనిపోతున్నారని, కావున ప్రభుత్వం రూ.పది లక్షలు గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలు మార్చాలన్నారు. ఆశా వర్కర్‌ను రోజు విలేజ్ క్లీనింగ్ సచివాలయంలో ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని, ఉదయం, సాయంత్రం రెండుసార్లు సంతకాలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. సెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలవుతున్నారని, సంబంధం లేని పనులు చేయించడం ఆపాలి కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రతి నెలా వేతనాలు వచ్చేలా, బకాయి వెంటనే చెల్లించాలని, యూనిఫాంలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌరి, లక్ష్మి, జ్యోతి, కృష్ణవేణి, పార్వతి, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు ఆశాల వినతి

గుమ్మలక్ష్మీపురం : ఆశ వర్కర్లకు కనీసం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా వర్కర్లుగా మార్చాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆశా వర్కర్ల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని కోరుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సెలవులు, క్యాజువల్, మెడికల్ లీవ్‌లు, వేతనంతో కూడిన మెటర్నరీ అమలు చేయాలని కోరారు. సంబంధంలేని పనులు చేయించరాదని, సెల్‌ఫోన్లు ఇవ్వాలని, శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వమే రికార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్, మండల నాయకులు సన్యాసిరావు, పలువురు ఆశా, కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

వైటిసిలో గర్భిణుల వసతి గృహం

స్కిల్ డెవలప్‌మెంట్, టూరిజంపై దృష్టి : పిఒ రాహుల్ కుమార్

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో డోలమోతల్లేకుండా, గిరిజన గర్భిణుల సుఖప్రసవాల కోసం యూత్ ట్రైనింగ్ హాస్టల్‌లో వసతి గృహం ఏర్పాటు చేస్తున్నట్టు ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎక్కువగా స్వయం ఉపాధి అవకాశాల జీవనోపాధులు పైనా, కొండ పోడు పట్టాలుపై 90 శాతం వరకు వినతులు వచ్చాయని అన్నారు. ఆదివాసీ దినోత్సవం రోజు కొందరికి పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయగా, అక్కడ ఎక్కువగా మలేరియా కేసులు ఉన్నాయని, నాటు వైద్యంపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్టు గుర్తించామని తెలిపారు. రాగోలు జెమ్స్ హాస్పిటల్ నుంచి 18 మంది వైద్య విద్యార్థులను తీసుకుని మలేరియా ఉన్న చోట స్క్రీన్ టెస్టులు చేయిస్తామన్నారు. వైద్యంపై ఇతర అంశాలు వివిధ శాఖ అధికారులతో సమన్వయం చేసి అవగాహన కల్పిస్తామన్నారు. జ్వరాలపై ప్రతిరోజు సాయంత్రం వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో డోలి మోతాలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. డీఎస్సీ కోసం శిక్షణ కోసం ఈనెల 5 నుంచి 12 వరకు సీతంపేట, మందస మండలాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని, 13, 14 తేదీల్లో స్క్రూట్నీ చేస్తామని తెలిపారు. ఎస్‌జిటి, డిఇడి, బిఇడి అభ్యర్థులు టెట్ లేకపోయినా పర్వాలేదని చెప్పారు. వీరికి భోజనం వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎఐఎంఎల్, ఫుడ్ ప్రాసెసింగ్ టూరిజం, గూగుల్ ఫోమ్ చేసి ఈ మూడు కోర్సులపై ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇస్తామన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.6.50 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆడాలీ యు పాయింట్ నుంచి వంశధార ప్రాజెక్ట్‌లో బోట్ షికారు ఏర్పాటు చేసి శ్రీముఖలింగం గుడికి వెళ్లేలా చర్యలు చేపడతామని, మ్యూజియం పనులను పూర్తి చేయడానికి చర్యలు చేపడతామని చెప్పారు. గిరిజన విద్యార్థులకు క్రీడలు, సాంకేతిక నైపుణ్యం పెంపొందించేందుకు దృష్టిసారిస్తామన్నారు. ఈనెల 9న తలపెట్టిన ఆదివాసీ దినోత్సవానికి సుమారు 2వేల మంది గిరిజనులు హాజరయ్యే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషన్ లోని రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ఆస్తులను భద్రపరిచే గదులు, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణను పరిశీలించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, పనితీరును ఆరాతీశారు. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, నాటుసారా అక్రమ రవాణాలు అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పర్యవేక్షిస్తూ, భద్రతా ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకొని అధికారులకి తగు సలహాలిచ్చారు. అనంతరం పి.కోనవలస చెక్‌పోస్టును పరిశీలిం చారు. ఎస్పి వెంట సాలూరు పట్టణ, రూరల్ సిఐలు సిహెచ్.వాసునాయుడు, జి.బాలకృష్ణ, పాచిపెంట ఎస్సై నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

టెన్త్, ఇంటర్ దూరవిద్య ప్రవేశాలకు నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024- 25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ దూర విద్యా విధానం కోర్సులకు ప్రవేశాల నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రకటించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో నిలిపివేసిన వారిని గుర్తించి లక్ష్యం మేర నమోదు ప్రక్రియ జరిగేలా చర్యలు చేపట్టాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.కేశవ నాయుడు, డిఇఒ జి.పగడాలమ్మ, ఎమ్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పూలమొక్కను అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

మంత్రిని కలిసిన ఎస్‌పి , పిఒ

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని శనివారం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యల గురించి మంత్రి సంధ్యారాణికి వివరించారు.

మంత్రిని కలిసిన పిఒ

పార్వతీపురం ఐటిడిఎ పిఒ ఎస్.సేధు మాధవన్ శనివారం సాలూరులో స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పరిధిలో గిరిజానాభివృద్ధికి కృషి చేయాలని మంత్రి తెలిపారు.

మంత్రికి పూలమొక్కను అందజేస్తున్న పిఒ మాధవన్

సహారా ఖాతాదారులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సహారా ఖాతాదారుల చెల్లింపులను త్వరితగతిన జరిగేలా చూడాలని కోరుతూ సహారా ఇండియా ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం బ్రాంచ్ పరిధిలో సుమారు 40వేల మంది ఖాతాదారులకు రూ.100 కోట్లు పైగా చెల్లింపులు జరగాల్సి ఉందన్నారు. కూలీ, నాలి చేసి కష్టపడి సంపాదించి సొమ్మును పిల్లల భవిషత్తు అవసరాలకై సహారా ఇండియా కంపెనీలో డిపాజిట్ చేసామన్నారు. కాలపరిమితి పూర్తయి ఏళ్లు గడిచినా చెల్లింపులు జరగక అవసరాలు తీరిక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏజెంట్లు కూడా ఖాతాదారుల వత్తిడి తట్టుకోలేక అనారోగ్యం పాలై కొంతమంది చనిపోయారన్నారు. మరణించిన ఖాతాదారులకు కూడా చెల్లింపులు చేయడంలేదని, కావున ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొర్లి వెంకట రమణ, ఇందిర, సూరిబాబు, సహారా బాధితులు శ్రీనుబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : సహారా ఇండియాలో దాచుకున్న డబ్బును వెంటనే పంపిణీ చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సహారా ఇండియా ఏజెంటు అడ్డగూడూరి రాంబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులు పాచిపెంటలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ఉద్దేశించి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రెండున్నర కోట్ల మంది బాధితులు సహారా ఇండియాలో దాచుకున్న డబ్బును ఎన్నో ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్పందించి అమిత్ షా నాయకత్వంలో గతేడాది పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించి లబ్ధిదారులందరికీ డబ్బులు పంపిణీ చేసి న్యాయం చేయాల్సి ఒదిగా డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన డబ్బులు చెల్లించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏజెంట్లు పల్లె పోలురాజు, పి.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, పంతులు, రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు, బోర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, ఖాతాదారులు

పింఛన్లు సరే... సూపర్ సిక్స్ సంగతేంటి?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు రెండుసార్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఇదేమీ కొత్త పథకం కాకపోయినప్పటికీ జిల్లాలో ఒకటో తేదీనే అందరికీ అందించేందుకు ప్రయత్నం చేశారు. ఆ మేరకు సఫలీకృతులయ్యారనడంలో సందేహం లేదు. ఈ మాటకొస్తే ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా మిగిలి ఉన్న అర్హులకు పింఛన్లు అందించారు. ఎప్పటి మాదిరిగానే ఇస్తున్నవారికి ఒకటోతేదీనే ఇవ్వాలంటూ గ్రామంలో సచివాలయ ఉద్యోగులు మొదలుకుని జిల్లా కలెక్టర్ వరకు మెడపై కత్తిపెట్టి హడావుడి చేయాల్సిన అవసరం లేదన్నది పబ్లిక్ టాక్. వైసిపి ఓటమికి, టిడిపి, జనసేన కూటమి గెలుపునకు ఆయా పార్టీల ఉమ్మడి అజెండాగా ప్రవేశపెట్టిన సూపర్ -6 పథకాలు ఎంతో ఉపకరించాయి. వీటిలో ఉచిత గ్యాస్ సిలిండర్లు ఒక్కటే కొత్త పథకం. మిగతా అన్నీ పాత పథకాలే అయినప్పటికీ డబ్బులు కాస్తా పెంచారు. ఇందులో తల్లికి వందనం పథకం గురించి చెప్పుకుంటే పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు వెళ్తే వారందరికీ రూ.15వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. ఈ లెక్కన ఈ పథకం పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో జూన్, జులైలోనే అమలు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఎందుకంటే పుస్తకాలు, ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు, ఇతరాత్ర ఖర్చులు రూ.వేలల్లో అయ్యాయి. కానీ, దీని అమలుపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. అవసరానికి ఇవ్వకుండా తర్వాత ఇస్తే ఉపయోగమేమిటి అన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. కానీ, ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేల గురించి మాట్లాడడం లేదు. ఇప్పుడు సాయం గురించి మాట్లాడకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. 19ఏళ్ల నుంచి 65ఏళ్లలోపు వయసుగల మహిళలందరికీ రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్న మాటలు నేడు మచ్చుకు కూడా కనిపించలేదు. మరోవైపు రూ.20లక్షల ఉద్యోగాలు, ఈలోపు నిరుద్యోగ భృతి అన్న మాటలు కూడా మచ్చుకు వినిపించ లేదు. మహిళలు అడగకపోయినా ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఎన్నో నెలలు కాకపోయినప్పటికీ, దీనిపై అదుగో ఇదిగో అంటూ చెప్పాల్సిన అవసరం ఏముందని చాలా మంది నోట వినిపిస్తోంది. వీటన్నింటికి మించి ఏడాదికి మూడు గ్యాస్ సిలెంటర్లు ఉచితంగా ఇస్తామన్న హామీ కోసం గ్రామీణ పేదలంతా ఎదురు చూస్తున్నారు. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు ఏడాదికి 1500 ఇస్తా మన్న హామీ కూడా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇలా ఏ నలుగురు కలిసినా సూపర్ సిక్స్ పథకాల గురించి చర్చ జరుగుతోంది. వీటి గురించి మాట్లాడ కుండా ముఖ్య మంత్రి రాష్ట్రంలోని అప్పులు ఆర్థిక పరిస్థితుల గుర్తించి మాట్లాడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తల్లికి వందనం పథకం అమలుకు సాక్షాత్తు రాష్ట్ర విద్యాశాఖ మంత్రే సంఘాలతో చర్చిస్తాం. రోడ్‌మ్యాప్ రూపొందిస్తాం అన్న మాటలు అమలుపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంగతి సిఎంకు ఎన్నికలకు ముందు గుర్తులేవా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

ఏరియా ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రి పనులు త్వరితగతిన పూర్తి చేసి వైద్యసేవలను మెరుగుపర్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఎం.తిరుపతి రావు, పి.సాంబయ్య, ఏ.భాస్కరరావు, జె.శ్రీరాములు శనివారం ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 పడకల హాస్పిటల్‌ను వంద పడకల హాస్పిటల్‌గా నిర్మించేందుకు సుమారు రూ.20కోట్లుతో శంకుస్థాపన చేసి నేటికీ పూర్తి చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాస్పిటల్ పూర్తి కాకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు, వరండాలో బెడ్‌లపై రోగులు ఉన్నారన్నారు. గత కొంత కాలంగా హాస్పిటల్ నిర్మాణ పనులు జరగడం లేదన్నారు. పడకల సామర్థ్యం లేక ఎక్కువ కేసులు శ్రీకాకుళం రిఫర్ చేయడంతో ఆదివాసీలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రజా ప్రతినిధులు చొరవ చూపి పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేట పంచాయతీలోని ప్రధాన కాలనీలకు వెళ్లే రహదారులు శిథిలం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన స్థానిక సర్పంచ్ తీళ్ళ కృష్ణారావు మాధవ, వెంకంపేట ప్రధాన రహదారితో పటు వైకేయం కాలనీ ప్రధాన రహదారిలో శనివారం మరమ్మత్తులు నిర్వహించి, కంకరతో గుంతలను పూడ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు జాగాన రవికుమార్ పాల్గొన్నారు.

రేషన్ లబ్దిదారులకు రాగులు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల నుంచి నిత్యవసర వస్తువులైన బియ్యంతో పాటు చోళ్ళు కూడా పంపిణీ చేస్తున్నట్లు జిసిసి అధికారులు తెలిపారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం జిసిసి గోదాముకు 7 క్వింటాళ్ల చోళ్లు శనివారం వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుమ్మలక్ష్మీపురం జిసిసి బ్రాంచ్ పరిధిలో ఉన్న 35 డిఆర్ డిపోల ద్వారా రేషన్ లబ్దిదారులకు చోళ్ళు పంపిణీ చేస్తామని సూపరింటెండెంట్ సాంబశివరావు తెలిపారు.

తహాశీల్దార్‌గా అప్పారావు బాధ్యతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం తహాశీల్దార్‌గా ఎన్.అప్పారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ గుమ్మలక్ష్మీపురం తహాశీల్దారుగా అప్పారావును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ ప్రాంతంలో రెవెన్యూ సమస్యలపై ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.

కిమ్మిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది ,పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సమాచారమివ్వండి

ప్రజాశక్తి - వీరఘట్టం

తరచుగా గ్రామాలు సందర్శించి, ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని తమకు సమాచారం ఇవ్వాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ గ్రామంలోనైనా ఎక్కువమంది జ్వర పీడితులు ఉంటారో తమ దృష్టికి తీసుకొస్తే అక్కడ ప్రత్యేక వైద్య శిఖరాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జ్వరాలపైన నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేటాయించిన గ్రామాలను తరచుగా సందర్శించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీరఘట్టం, బిటివాడ వైద్యాధికారులు ప్రదీప్‌కుమార్, మానస, ఎంఎల్‌హెచ్‌పిలు, పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పల్లా సింహాచలం నాయుడు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావుకు శనివారం పాఠశాల వద్ద మైక్ సెట్ ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో రెండున్నర దశాబ్దాలు తాను పనిచేశానని, ఈ పాఠశాలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని అన్నారు. భవిష్యత్‌లో పాఠశాలకు ఎటువంటి అవసరాలున్నా తాను సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు కర్రి ఉమా మహేశ్వర రావు, బుజ్జి , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన వీరేష్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

ఎస్‌పికి మొక్క అందిస్తున్న వీరేష్

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వి మాధవరెడ్డిని శనివారం ఎస్పీ కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువగా గంజాయి, మద్యం తదితర చెడు వ్యసనాలకు బానిసై చెడిపోతూ వారి జీవితంతో పాటు కుటుంబం ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమవుతుందన్నారు. కావున గంజాయి వినియోగం, రవాణా అణచివేత, అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టడంలో ఉక్కుపాదం మోపాలని కోరారు. దీనికి ఎస్‌పి సానుకూలంగా స్పందించి తనవంతు కృషి చేస్తానని తెలిపారని అన్నారు

ఏరోప్లేన్ నిలిచిన వెహికల్

ప్రజాశక్తి - భామిని

మండలంలోని దిమ్మిడిజోల గ్రామం ప్రధాన రహదారి పక్కన విమానం బాడీతో వున్న హెవీ వెహికల్ శనివారం ఉదయం నుంచి రోడ్డుపైనే నిలిపివేశారు. దీంతో చుట్టు పక్కల గ్రామస్థులు ఈ ఏరోప్లేన్ బాడీని చూడడానికి, సెల్ఫీ తీయటానికి తరలి వచ్చారు. దీంతో ఆ ప్రాంతం జనసందోహంగా మారింది. ఏరోప్లేన్ బాడీని ఒడిస్సా నుంచి ఆంధ్రాకు తరలిస్తున్నట్లు తెలిపారు.

టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోన గ్రామంలో వర్షాకాలంలో పేదలు నివసిస్తున్న ఇంటిలో వర్షం నీరు వచ్చి చాలా ఇబ్బంది పడుతున్న గిరిజనులకు శనివారం పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, సెక్రెటరీ బిఎన్‌బి రావు ఆధ్వర్యంలో టార్పాలిన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కే రామస్వామి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు), పి.కాళీ ప్రకాష్, టి.రఘు నాయుడు, బోటు రామకృష్ణ, జీవితకాల సభ్యులు కోలా సీతారాం, బొండపల్లి వెంకటరమణ, ఎ.తవిటి రాజు, త్రాసుల సతీష్ చంద్ర, జిల్లా కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని ఘనసర పంచాయతీలో శనివారం మురుగు కాలువలలో చెత్తను తొలిగించి శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా ప్రబలకుండా మురుగు కాలువలు శుభ్ర చేసి, గ్రామాలలో శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామని సర్పంచ్ ప్రతినిధి కిల్లారి పాల్గుణరావు తెలిపారు. ఇంటిలో పేరుకుపోయిన చెత్తను కాలువలు, ఇంటి పరిసరాలలో వేయవద్దు అని, చెత్త సేకరణ బళ్ళలో వేయాలని సూచించామని తెలిపారు.

ముగిసిన పారిశుధ్య పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జూలై 16నుంచి నిర్వహించిన పారిశుధ్య పక్షోత్సవాలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేశారు. ముందుగా నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం పారిశుధ్య పనులు నిర్వహించారు. అందులో భాగంగా పారిశుధ్య నిర్వహణపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి హామీ సిబ్బందికి పారిశుధ్య నిర్వహణపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. డ్రై డేగా పాటించడం, గ్రామపంచాయతీ కార్యాలయం సిబ్బందితో చెత్తకుప్పలు, మురుగు నీరు నిల్వలు, పైప్ లైన్ లీకేజీలో ఉన్న ప్రదేశాల గుర్తింపు, అవసరం మేరకు చెత్త కుప్పలు తొలగింపు, శానిటేషన్ అవేర్నెస్ డే కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బందికి, స్వయం సహాయ సంఘాలు, శ్రమశక్తి సంఘాలు, దుకాణ యజమానులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వలను, గుంతలను పూడ్చిడం, మురుగు కాలువలో పూడికతీత, మురుగునీరు సాఫీగా ప్రవహించేందుకు తగు చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది సహకారంతో నాణ్యమైన క్రిమిసంహారక మందులు పిచికారీ,

పార్వతీపురం: బావిలో బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న సిబ్బంది

గ్రామపంచాయతీ చేతిపంపులు, నీటి కుళాయిల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడడం, మరమ్మతుల నిర్వహణ పనులు చేపట్టారు. అన్ని గ్రామాల్లో ఫాగింగ్ నివారణ మిషన్లతో దోమ నివారణకు చర్యలు చేపట్టారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకొని, సంబంధిత ఇంటి, హొటల్ యజమానులకు నోటీ సులు జారీ చేశారు. కార్యక్రమంలో ఆఖరు రోజైన శుక్రవారం డ్రై డే పాటించుట ద్వారా కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

మమ అనిపించిన పక్షోత్సవాలు

పాలకొండ : గత నెల 16నుంచి ఈనెల 2 వరకు పారిశుధ్య పక్షోత్సవాలు జరపాలని అధికారి యంత్రాంగం ఆదేశం చింది. అధికారులు అన్ని గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించినట్లు ప్రకటనల ద్వారా చెప్తున్నప్పటికీ గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఎక్కడా పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేదనే చెప్పవచ్చు. అసలే వర్షాకాలం, వ్యాధులు విజంభిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 32 పంచాయతీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నవగాం, వాటపాగు, తంపటాపల్లి, కొండాపురం, సింగనవలస, వెలగవాడ, తదితర పంచాయతీల్లో అపారిశుద్ధ్యంగా ఉంది. పారిశుధ్య పక్షోత్సవాలు పేరిట అధికారులు హడావుడి చేశారు తప్ప ఎక్కడ పారిశుధ్య నిర్వాహణపై దృష్టి పెట్టిన దాఖలాల్లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీని కోసం ఆయా పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించారు. పంచాయతీకి కేటాయించిన నిధులే అరకొరగా ఉన్నాయని ఈ పనులు ఏ విధంగా జరుగుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలని గ్రామీణ వాసులు కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తల్లిపాలలో పోషక విలువలు ఉన్నాయని, కావున ఇవి బిడ్డకు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ఆరు నెలల వరకు ప్రతి తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు,

గుమ్మలక్ష్మీపురం: ర్యాలీ చేస్తున్న సిబ్బంది

అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు, సీతానగరం, చినబోగిలి, బగ్గందొరవలస, చల్లంనాయుడువలస, పనుకుపేట, జోగింపేట, ఇప్పలవలస తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎం.రాధాక్రాంతి, పావని మాట్లాడుతూ తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనన్నారు. ప్రతి గర్భిణి ఎప్పుడు కప్పుడు సకాలంలో తనిఖీలు నిర్వహించుకుని పౌష్టికాహారం తీసుకుంటే పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరిగి ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. కార్యక్రమంలో ఎస్‌విలు వరలక్ష్మి, పిఎస్ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు జి.జ్యోతి, టి.జయలక్ష్మి, ఎ.నాగమణి, జె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలుతోనే ఆరోగ్యమని మండలంలోని విక్రాంపురం ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని విక్రాంపురం, పరశురాంపురం సచివాలయాల పరిధిలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు

సీతానగరం : ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అందిస్తున్న పౌష్టిక ఆహారం వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ కలింగ మల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ రామకృష్ణ, అంగన్వాడీ సూపర్వైజర్ శారదాంబ, సెక్టార్ యూనియన్ నాయకులు ఎస్.జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్షణ అని ఐసిడిఎస్ సూపర్వైజర్ జి. శ్రావణి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా మండలంలో ఆవిరి , కాకిలి, పొడ్డీస గ్రామాల సెక్టార్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, బాలింతలు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

20లోపు గోతులు పూడ్చకపోతే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారిపైన ఉన్న గోతుల వద్ద మరమ్మతు పనులు ఈనెల 20లోగా చేపట్టకపోతే నిరాహార దీక్ష చేస్తామని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి హెచ్చరించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని కూనేరు సంతలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతరాష్ట్ర రహదారి మార్గంలో ఉన్న పెద్దపెద్ద గోతులను కప్పి అటు వాహనదారులు ఇటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. గోతులను పూడ్చాలని సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేక నిరసనలు చేపట్టడంతో కొంతవరకు పనులు జరిగాయన్నారు. ప్రస్తుతం మళ్లీ గోతులు ఏర్పడ్డాయన్నారు. కావున వెంటనే ఆర్అండ్‌బి అధికారులు ప్రతిపాదన పెట్టిన నిధులను విడుదల చేసి పార్వతీపురం నుండి కూనేరు వరకు వెళ్లే రోడ్డు ఉన్న గోతులను కప్పి ప్రయాణికులకు భద్రతపై భరోసా కల్పించాలని కోరారు. లేకుంటే ఈనెల 20 తర్వాత ఈ గోతుల వద్ద నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ప్రసాదు, చెంబు సంజీవి, జి.జగన్నాథం, రెడ్డి శివున్నాయుడు గిరిజన యువకులు పాల్గొన్నారు.

పాఠశాలలన్నింటికీ సమన్యాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వం తలపెట్టిన హేతుబద్ధీకరణలో భాగంగా పాఠశాలలన్నింటికీ సమన్యాయం పాటించేటట్లు మండలస్థాయి, జిల్లా అధికారులను ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు మండల మురళి కోరారు. శనివారం మండలంలోని నూరుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎపిటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బకాయిలన్నింటినీ సత్వరం చెల్లించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి రఘు మండల ధనుంజయ నాయుడు, జిల్లా కార్యదర్శి ఎం నరహరి, బియం గౌరీశ్వరరావు, బివి నాయుడు, శ్రీనివాసరావు, బి.హరినారాయణ, గంట ప్రసాదు, ముద్దులమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎ.వరప్రసాద్ అన్నారు. శనివారం ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కూనేరు వద్ద ఆర్‌టిసి, రోడ్డు రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఒడిశా నుంచి ఆంధ్రలోకి వస్తున్న వాహనాలతో పాటు ఆటోలను తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయా లేవని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటోలు, వ్యాన్లకు సంబంధించి ఫిట్నెస్ లేని వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణించరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను మైనర్లకు ఇచ్చి వాహనాలు నడిపిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారి లైసెన్స్ రద్దుచేసి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం ఎస్ కె, దుర్గ సిబ్బంది పైడితల్లి, రవాణా శాఖ పోలీసులు ఉన్నారు.

సాలూరు : రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్

సాలూరు: మాట్లాడుతున్న ప్రసాద్

జెవిఎస్ఎస్ఎస్ ప్రసాద్ కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించినప్పుడే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని చెప్పారు. సిఎంఒ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తిని గంటలోపు సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్తే బతికించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కాశీరాం నాయక్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సిధరపు అప్పారావు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు గిరిజన ప్రాంతాల్లో పరిపాలన చేసిన పార్టీలు గానీ ప్రభుత్వాలు గానీ గిరిజనులకు కనీస సౌకర్యాలను కల్పించలేదన్నారు. కేవలం ఆదివాసి గిరిజనులను తమ రాజకీయ స్వార్ధ ప్రయోజనాల కోసం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించు కున్నారని గిరిజన ప్రాంతంలో కనీస సదుపాయాలైన రోడ్లు, మంచినీళ్లు, విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందడం లేదని చెప్పారు. నిత్యం వైద్యం కోసం పదుల కిలోమీటర్లు డోలీల మోత తప్పడం లేదని సరైన విద్యా సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సాంప్రదాయాలను కాపాడే విధంగా ప్రభుత్వాలు

వివరాలను వెల్లడిస్తున్న అప్పారావు

ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో మైనింగ్ పేరుతో అడవుల నుండి ఆదివాసీలను గెంటివేస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వాలు గిరిజనుల పైన దృష్టి పెట్టి అటువంటి చర్యలకు పాల్పడే వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సాలూరు పట్టణంలో గిరిజన సంప్రదాయాలతో జరుగుతుందని దీని కోసం ప్రజలు, ఆదివాసి సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘ మండల అధ్యక్షులు వంతల సుందర్ రావు, కూనేటి చినబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి అఖిల్ అన్నారు. శనివారం కొమరాడ బాలికల, పెదఖేర్జల బాలుర ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. అఖిల్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలో సరైన వసతుల్లేని పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులకు సరైన ప్రహరీ గోడ, గేటు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. అక్కడి విద్యార్థులకు ఉండడానికి సరైన వసతి, తరగతి గదుల్లేవని అన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీ లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అదనపు భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు

వంటలను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాణ్యమైన భోజనం పెట్టాలని, కనీస సౌకర్యాలు కల్పించకపోతే భవిష్యత్తులో విద్యార్థులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమి టీ సభ్యులు కె.డేవిడ్, కె.మల్లేష్, మండల కమిటీ సభ్యులు కె.అలివేణి, టి.గంగోత్రి, హెచ్.శైలజ, డి.ఆశ పాల్గొన్నారు.

వరుస నాట్లుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తాడు ఆధారంగా వరుస పద్ధతిలో వరి నాటుకుంటే అధిక దిగుబడి సాధించడమే కాకుండా, చీడపీడలు నివారించవచ్చని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం ఎడిఎఆర్ శ్రీనివాసరావు వివరించారు. శనివారం మండలంలోని డోకిశిలా రైతు సేవా కేంద్ర పరిధిలోని పొలంబడి కార్యక్రమాన్ని, ఎడిఎలు బి శారద, డి.భారతితో కలిసి ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత గ్రామంలోని రైతులకు ఒక మీటరు చదరపు అడుగులో 33 కుదుళ్ళు వచ్చేటట్లు వరుస పద్ధతిలో వరి నాటుకునే విధానాన్ని ప్రత్యక్షంగా విశదీకరించారు. ఈ పద్ధతి వల్ల మొక్కలకు విస్తారంగా గాలి తగలడమే కాకుండా ఎరువులు పురుగుల మందులు స్ప్రే చేసుకునేందుకు వీలుగా ఉంటుందని, తెగుళ్ల చీడపీడలు విస్తరించకుండా నివారించవచ్చునని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తెగుళ్ళ నివారణ కోసం రసాయన మందులు ఉపయోగించకుండా రైతులు సాధారణంగా తమ గ్రామాల్లో దొరికే వేప గింజలతో కషాయాన్ని ఏ విధంగా తయారు చేసుకోవచ్చు చేసి చూపించారు. మండల వ్యవసాయ అధికారి అశోక్, సహాయకులు సంధ్య, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రేని వై. శ్రీరాములు పాల్గొన్నారు.

సస్యరక్షణకు చర్యలు చేపట్టాలి

కురుపాం: రైతులు సాగు చేస్తున్న పంటలను తెగుళ్ళ బారిన పడి నాశనం కాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ అన్నారు. శనివారం మండలంలోని రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రం వద్ద వ్యవసాయ అధికారులు, కెవికె శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఎక్కువగా సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కంది, పత్తి పంటకు సస్యరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో రైతులకు ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ ధ్రువ, వ్యవసాయాధికారులు, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన పెరగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అవయవ దానంపై ప్రజలు అవగాహన పెంచుకోగలిగితే ఎందరికో ప్రాణ భిక్ష లభిస్తుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. భారతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా శిశుసంక్షేమ సాధికారికత అధికారి ఎంఎం రాణి సారథ్యంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో శనివారం స్థానిక భాస్కర డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి మాట్లాడుతూ మనిషి చనిపోయాక మనిషి తన శరీరంలోంచి 200 అవయవాలు, కణజాలాన్ని దానం చేయవచ్చు అన్నారు. కళ్ళు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, పెద్ద ప్రేగు చిన్నప్రేగు, ఎముకలు ములుగులు, దానం చేయవచ్చని ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత సగటు ఆరుగురికి, ఏడుగురికి జీవితం ఇవ్వవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాస్కర కాలేజీ ప్రిన్సిపల్ జి.అప్పారావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ అరసవిల్లి నాయుడు, లీగల్ కం ప్రొఫెషన్ ఆఫీసర్ పారిశెర్ల శ్రీధర్, కౌన్సిలర్ తవిటి నాయుడు, ఔట్రీచ్ వర్కర్ అనిల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం
మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల దళితులకు, అణగారిన వర్గాలకు ఎంతో మేలు కలుగుతుందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్‌సి కులాల వర్గీకరణకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు చొరవ, మందకృష్ణ మాదిగ పోరాటి పటిమ, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కరుణతో 40 ఏళ్లుగా మాదిగలు చేస్తున్న పోరాటానికి ఒక సార్థకత లభించిందన్నారు. ఇప్పటికైనా దళితులందరూ విభేదాలను మరచి, బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగ ఫలాలను అందరికీ వర్తించేలా సహకరించుకుందామని పిలుపునిచ్చారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినకుదమకు చెందిన మంత్రబుడ్డి దాలినాయుడు, నల్ల వెంకట్ నాయుడు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకున్న విషయం తెలుసుకున్న వైసిపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షితరాజు శనివారం పరామర్శించారు. మంత్రబుడ్డి వెంకటేష్, ట్రిపుల్ ఐటి విద్యార్థి నల్ల సాయి కార్తీక్ ఇంత చిన్న వయసులో చనిపోవడం విచారకరమన్నారు. ఆయనతో పాటు పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం పరామర్శ

మండలంలోని చినకుదమకు చెందిన ట్రిపుల్ ఐటి విద్యార్థి నల్ల సాయి కార్తీక్ నాయుడు ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబాన్ని కలవర పరిచింది. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నాయకులు కొల్లి గంగునాయుడు, గరుగుబిల్లి శ్రీను, పల్ల కురిమి నాయుడు తదితరులు ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. విద్యార్థిగా ఎన్నో అవాంతరాలు దాటి మంచి భవిష్యత్తు ఉంటుందని భావించిన ఆ తల్లిదండ్రులకు పుత్ర శోకం మిగిలిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సిసి రహదారులకు మహర్దశ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు వీరఘట్టంలోని పలు వీధుల్లో సిసి రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ తెలిపారు. స్వామి థియేటర్ నుంచి ఆర్ అండ్ బి బంగ్లా వరకు, చెగిడి వీధి నుం,ఇ పొల్లరోడ్డు వరకు, ముచ్చర్ల వీధి నుంచి ఘూసి వీధి వరకు, సామిల్లి నుండి స్మశాన వాటిక వరకు ఎస్సీ కాలనీ, దుర్గపేట నుండి మందిరపు వీధి వరకు తదితర వీధుల్లో సిసి రహదారులు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇంజనీర్ సహాయకులతో రహదారులకు కొలతలు వేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు బల్ల హరిబాబు, తూముల రమేష్, పప్పల మహేష్, తదితరలు పాల్గొన్నారు.

వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును పాడు చేసుకోకుండా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదన్నారు. విద్యార్థి దశలోనే సమాజం పట్ల అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో

కురుపాం: మాట్లాడుతున్న ఎస్ఐ షణ్ముఖరావు

ప్రిన్సిపల్ వై.దాలినాయుడు, అధ్యాపకులు వరప్రసాద్, వినోద్, డి.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

కురుపాం : ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్సై షణ్ముఖరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవ్టీజింగ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి విద్యార్థులు ఎవరూ గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రతి విద్యార్థి సక్రమంగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమాల్లో కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.